కథా నిలయం
శ్రీకాకుళం

# ఈ హాయి ఇక్కడే ఉంది...

"ఇందూ! శిరీష వదినకు సీమంతం చూడముచ్చటగా జరిగిందే" ఇంద్రాణి జడలో పూలదండ తురుముతూ అంది సుమతి.

"అవునా. శిరీష వదినకు సీమంతమా" తల్లివైపు గిరుక్కున తిరిగి ఆశ్చర్య పోతూ అడిగింది ఇంద్రాణి. "అయితే మధుసూదనన్నయ్య తండ్రి కాబోతున్నా డన్నమాట, భార్యమీద కోపతాపాలు పోయాయన్నమాట" మనసులో అనుకుంది.

"అయితే వెంటనే చూసి రావాలి' లేవబోయింది.

'ఉండు ఉండు అప్పుడేనా. మూడ్రేళ తర్వాత రాకరాక వచ్చావు పుట్టింటికి. నా కంటే నీకు. శిరీష వదినే ఎక్కువైందన్న మాట' అంది సుమతి తెచ్చి పెట్టుకున్న కోపంతో

"బలేదానివమ్మా. అలా అంటావేమిటి? శిరీష వదినా, నేనూ ఎంత క్లోజో నీకు తెలియదా?' అంది ఇంద్రాణి చిన్నబుచ్చుకుంటూ.

"ఊరికే అన్నా లేవే' తల మీద చిన్నగా మొదుతూ అంది సుమతి.

"అవును వదినా. నువ్వు అప్పుడే ఇల్లు కదలడానికి వీల్లేదు. నువ్వొచ్చావని నీ వొచ్చావని కమ్మని కూరలు వండాను. అవన్నీతిని, కాస్త రెస్టుతీసుకుని సాయంత్రానికి వెళుదువగానీ. నేను కూడా నీతో వస్తాను' అంది అప్పుడే అక్కడకు వచ్చిన త్రివేణి.

త్రివేణి ఆ యింటి కొత్తకోడలు. పెళ్లయి నెలరోజులన్నా కాకముందే ఇంట్లో అందరితో కలిసిపోయింది. సుమతికి ఇంద్రాణి కొరత తీర్చింది. పెళ్లప్పుడు రెండు రోజులు ఉండి హడావిడి చేసి వెళ్లిపోయిన ఆడబిడ్డకు మర్యాదలు చేయడానికి, ఆమెతో చనువు పెంచుకోవడానికి ఇదే అదను అని ఆ పిల్లకు తెలుసు. అందుకే కాసేపు ఇంద్రాణితో గడపాలని, ఇదే అదను అని ఆ పిల్లకు తెలుసు. అందుకే కాసేపు ఇంద్రాణితో గడపాలని అనుకుంటోంది.

'సరే సరే. మీరిద్దరూ భోజనాలు చేసి కాసేపు కబుర్లు చెప్పుకొని, ఎండ తగ్గాక శిరీష దగ్గరకు వెళ్లిరండి' అని వెళ్లిపోయింది సుమతి.

'దా వదినా. దా' ఇంద్రాణి చేయి పట్టుకుని వంటింట్లోకి తీసుకె ళ్లింది త్రివేణి.

ఆమెకొక పళ్లెం, తనకొక పళ్లెం తీసుకొని అన్నం కూరలు పెట్టి, నెయ్యి వేసి తెచ్చిడైనింగ్ టేబుల్ మీద పెట్టింది. ఫ్యాను వేసుకొని ఇద్దరూ ఎదురూ బొదురు కూర్చున్నారు.

చాలారోజుల తర్వాత పుట్టింటిలో భోజనం చేస్తున్న తృప్తితో ఇంద్రాణి అన్నం కలుపుతూ ఉంటే త్రివేణి అంది.

"వదినా. శిరీష వదినకు నువ్వంటే చాలా అభిమానం. ఈ ఇంట్లో నేను అడుగుపెట్టాకు ఒకటి రెండుసార్లు ఆమెతో మాట్లాడును. రెండుసార్లూ నీ గురించిన కబుర్లే. ఆమె బాగా మాట్లాడుతుంది. నవ్వినప్పుడు కూడా బలే ఉంటుంది.

"ఇప్పుడేం చూశావ్. కొత్తగా పెళ్లయి ఆ ఇంటికి వచ్చినప్పుడు చూడాలి. ఎర్రగా, బుగ్గా నిగనిగలాడుతూ ఉండేది. చేతులకు గోరింటాకు ఎట్లా పండేదనుకున్నావ్? కుళ్లు పుట్టేది. జడ వేసుకుంటే ఎంత చక్కగా, చీర కట్టుకుంటే ఎంత కుదురుగ్గా, పూలు పెట్టుకుంటే ఎంత ఒద్దికగా ఉండేదో. కొత్త ఇల్లు కదా. ఎవరితోనైనా ఏం మాట్లాడుతుంది? అందుకే నాతో దోస్తి కట్టింది. మేమిద్దరం మంచి ఫ్రెండ్స్ అయిపోయాం. నా పెళ్లిలో అన్ని పనులూ తనే చేసింది. అది చూసి అమ్మను అందరూ అడిగేవాళ్లు - "ఏమమ్మా. నీకు ఒకరా కూతుళ్ళు ఇద్దరా అని" ఆ మాట చెప్పి నవ్వింది ఇంద్రాణి.

"ఇప్పుడు నువ్వు లేవుగా. నెమ్మదిగా మేమిద్దరం ఫ్రెండ్స్ అయిపోతాంలే" అంది త్రివేణి.

'అమ్మో అయితే అయ్యావుగానీ నన్ను మర్చిపోయేలా చేయకేం' అంది ఇంద్రాణి భయం నటిస్తూ.

ఇద్దరూ నవ్వుకున్నారు.

భోజనాలు పూర్తయ్యాయి. చేయి కడుక్కుని నాప్‌కిన్‌తో చేయి తుడుచుకుంటుంటే త్రివేణి వచ్చి, ఆమె చేయి పట్టుకుని 'చాలా థ్యాంక్స్ వదినా' అంది. ఆ మాట అంటున్నప్పుడు ఆ పిల్ల కళ్లలో సన్నగా కన్నీటి తెర మొలిచింది.

"ఛ...ఛ... ఏంటమ్మా ఇది"... అంది ప్రేమగా దగ్గరకు తీసుకుని యింద్రాణి.

"నీ వల్లే మా పెళ్లి జరిగింది. ఇవాళ నీ పుణ్యమా అని హాయిగా ఉన్నాను" అంది త్రివేణి కృతజ్ఞతగా.

"ఇప్పుడంటే అన్నావుగానీ యికమీదట ఇలాంటి మాటలు మాట్లాడకు" అని ఆ పిల్ల బుగ్గ మీద చిన్నగా తట్టి, తన గదిలోకి వెళ్లిపోయింది ఇంద్రాణి.

విశ్రాంతి కోసం మంచం మీద వాలిందేగానీ ఆమెను రకరకాల ఆలోచనలు చుట్టుముడుతున్నాయి.

ఆమెకు పెళ్లయి భర్తతో ముంబై వెళ్లిపోయాక, ఒక రోజు ఆమె అన్నయ్య శేషుదగ్గర నుంచి ఫోను. తన ఆఫీసులోనే పని చేస్తున్న త్రివేణి అనే అమ్మాయిని ప్రేమించాననీ, కానీ ఆ అమ్మాయి కులం వేరు కావడంతో ఇంట్లో పెళ్లికి ఒప్పుకోవడం లేదనీ అమ్మానాన్నలతో మాట్లాడి ఒప్పించాలనీ... దాని సారాంశం.

ఆ మరుసటి రోజు కొరియర్‌లో త్రివేణి ఫోటో ఇంద్రాణికి అందింది. చూడగానే నచ్చేసింది.

ఇక తనే రంగంలో దిగి ఫోన్ల మీద వ్యవహారం నడిపించింది. తల్లికీ తండ్రికీ తన మాట మీద గౌరవం. అందుకుని ఇష్టం లేకపోయినా పెళ్లికి అంగీకరించారు. అలా పెద్ద వాళ్లకు ఇష్టం లేక పోయినా ఈ ఇంట్లో కాలు పెట్టిన త్రివేణి ఇవాళ హాయిగా ఉంది. కానీ అన్ని ఇష్టాలతో పక్కింట్లో అడుగు పెట్టిన శిరీషవదిన మాత్రం ఎన్ని కష్టాలు పడింది?

చీటికిమాటికి అత్తగారి వేధింపులు, భర్త బడితెపూజ. జానెడుద్యోగంతో రాజీపడ లేక బారెడు ఆశలు పెంచుకున్న మధుసూదనన్నయ్య... రాత్రనకా పగలకా తాగొచ్చి పెడుతున్న చిత్రహింసలనెట్లా భరించిందో! కట్నం చాలేదని... పుట్టింటి పునాదులు తవ్వుకు రమ్మని అనుక్షణం అవమానాలు... ఆ మానసిక వేదన నెట్లా భరించిందో!

"మా అమ్మా నాన్నలు చిన్నప్పుడే చనిపోయింద్రు. నా కెవ్వరూ లేరు. మీ అన్నయ్య తిరుగుళ్ళు ఎక్కువైపోయినై. నన్నో సేవకరాలిగానే చూస్తున్నాడు, గాని భార్యగా పలుకరించడం లేదు. బయటి రుచులు మరిగిన మనిషికి ఇంటి రుచి ఒంటబడ్తుండా" అంటూ తనముందు ఎన్నోసార్లు గోడు వెళ్ల బోసుకుంది.

కానీ ఆ కొడకుకుగానీ ఆ తల్లికిగాని ఎన్నిసార్లు హితవు చెప్పినా ఆ మాటలు వారి తలకెక్కేవి కావు. అమ్మ కూడా వాళ్ళత్తతో చెప్పి చూసిందిసారి. దానికా మహాతల్లి "మా సంసారం సంగతులు మావి. నా కోడలు. నా కొడుకు. నా ఇష్టం, నీ నంగనాచి మాటలు మాకెందుకు? మధ్యన మీకేమిటీ అవస్థ?" అని నిల దీస్తూ మూతి, చేతులు తిప్పేసింది.

గాలికిపోయే కంపను వేలికి తగిలించుకోవడమెందు కని అమ్మ ఊరుకుంది. అది తెలిసిన నాన్న "వాళ్ళ జోలికి వెళ్తే ఖబడ్దార్" అని వార్నింగిచ్చాడు. రోజూ పక్కింటి నుంచి పెడబొబ్బలు, తిట్లు అంగలార్పులు విని లోలోపల అల్లాడిపోవడమే కాని కల్పించుకునే ధైర్యం లేకపోయింది.

ముంబై వెళ్ళే ముందు పుట్టింటి కొచ్చినప్పుడు "అమ్మా శిరీష వదినకు ధైర్యం చెప్పి పోలీసు రిపోర్టు ఇప్పిద్దామే" అంది తల్లితో.

"వామ్మో. మీ నాన్న ఇల్లుపీకీ పందిరెయ్యడం ఖాయం. పోలీసు రిపోర్టిస్తే తల్లీ కొడుకుల్ని తీస్కపొయ్యి పక్కబొక్కలిరగ్గొడ్తారే తప్ప పెళ్ళాం మొగుణ్ణి కలప లేరుగదా. దిక్కు లేనోళ్ళకు దేవుడే దిక్కు ఇందూ. మండలం రోజులు హన్మాన్ చాలీసా చదువుతూ ఆ రామబంటుకు ప్రదక్షిణలు చేయమని చెప్పి చూస్తానో సారి....." అంది సుమతి.

ఆ తర్వాత శిరీషను నేరుగా కలిసే అవకాశం ఇంద్రాణికి రాలేదు... అప్పుడప్పుడు ఫోనులో ఆమె విశేషాలు వినడం తప్ప. ఇవాళ ఆమెను కలవబోవడం చాలా సంతోషం కలిగిస్తోంది.

సాయంత్రం అయింది. త్రివేణి, ఇంద్రాణి కలిసి పెరట్లోని సన్నజాజులు కోసి, మాలగా కట్టి, అరటి పండ్లు తీసుకొని శిరీష వాళ్లింటికి వెళ్లారు.

వాళ్లిద్దరినీ చూడగానే పసిపిల్లలాగా సంబరంగా ఎదురొచ్చింది. శిరీష.

"ఆహా. కొత్త త్రివేణి, పాత ఇంద్రాణి... జంగటా వచ్చారే.. ఎంత బాగుందో ఈ రోజు" ఎదురొచ్చి ఇద్దరి చేతులందుకుని చెంపల కద్దుకుంది.

"ఏమ్మా పొద్దున్నే దిగినవ్ గదా... ఈ వదిన గిప్పుడు గుర్తొచ్చిందా" ఇంద్రాణి నుదురు ముద్దాడింది.

"మీ వారు, పాప బాగున్నారా?" లాలనగా అడిగింది.

"అంతా బాగున్నారు వదినా"

ఇద్దర్నీ చెరో కుర్చీలో కూచోబెట్టి తానూ ఓ కుర్చీలో కూచుంది. "అత్తయ్యా చుట్టాలొచ్చిండ్రు" వంటింట్లోకి కేకేసింది.

ఇంద్రాణి శిరీషని పరిశీలనగా చూసింది. బయటకు కనిపిస్తున్న గర్భంతో నిండుగా... సద్దుల బతుకమ్మలా కన్పిస్తూంది. హుషారుగా, తృప్తిగా ఉంది ఆ హుషారు ఎట్లా వచ్చిందో అని ఇంద్రాణి ఆశ్చర్యంలోంచి తేరుకోకముందే "బాగున్నావా ఇంద్రాణీ!" అంటూ శిరీష అత్త చాయి గ్లాసుల్తో వచ్చింది.

అది చూసి ఇంద్రాణి ఇంకా ఆశ్చర్యపోయింది. "ఇది కోడలుకాదు. కోమటి చెరువు మడుగుల దొంగకొంగ. కొరివి దయ్యామోలె నా ఇంటికి దాపురించింది." అంటూ కోడల్ని తనముందే లెంపలు వాయించిన పిన్నేనా ఈమె!

జవాబుకోసం ఎదురుచూడకుండా ఖాళీ గ్లాసుల్ని లోపలికి తీసుకెళ్తున్న పెద్దావిడనలానే చూస్తుండిపోయింది ఇంద్రాణి.

"చెప్పు ఇందూ! మీ ముంబై ఎట్లుందీ?" ఆసక్తిగా అడిగింది శిరీష.

నెమ్మదిగా వాళ్లు కబుర్లలో పడ్డారు.

ముంబై ముచ్చట్లు, త్రివేణి ప్రేమ వివాహం పూర్వాపరాలు... ఇంటినిండా మసకచీకట్లు కమ్ముకుంటున్నై.

ఇంతలో మధుసూదన్ వచ్చాడు. రావడం రావడమే ధుమధుమ లాడాడు.

"నీయవ్వ... రాత్రయితే లైటెయ్యాలనే ధ్యాసగూడా లేదా. నువ్వు ముచ్చట్లంటే మూతులు సాపుతున్నావ్ గదూ. మొగడు, అత్తంటే మోటకేసిన మొద్దులను కుంటున్నావే మొద్దావతారమా..." తిడ్తూనే లైటు వేశాడు.

వెలుగులో ఇంద్రాణి కన్పించింది. కొంచెం తత్తరపడి "చూసినావా ఇందూ.. మీ వదిన నిర్వాకం.. నీ కంటే చిన్నోళ్ళను చూసి సిగ్గుదెచ్చుకోవే మొద్దుముండా..."

ఇదేమిటీ.... మధుసూదనన్నయ్య మారలేదా. అయ్యయ్యో.... మా ముందే వదినను కొడ్తాడేమో... ఇంద్రాణి గుండె పీచుపీచుమంటోంది. కాళ్ళుల్లో సన్నని వణుకు.... త్రివేణి బిక్కుబిక్కుమంటోంది.

ఇంతలో శిరీష లేచి నుంచుంది. "ముందు కాళ్ళు కడుక్కుని పూజగదిలో కెళ్ళి రావయ్యా. నాకెట్లాన్నో అవుతోంది...." అంటుంటే కనురెప్పలు సగం మూసుకు పోయాయి.

"వామ్మో... నువ్వు కూచో శిరీషా లెవ్వకే" పులిలా గాండ్రించినోడు పిల్లి పిల్లై పోయాడు. కాళ్ళు కడుక్కుని పూజగదిలోకెళ్లాడు. గొణుగుడు బయటికి వినబడుతూంది....

"అమ్మా... ఎల్లమ్మ తల్లీ... తప్పయిందమ్మా! ఇదో... చెంపలు వాయించు కుంటున్నా...."

సందు దొరికితే చాలు తల్లీకొడుకులు జంటకవుల్లా ఎదురెదురుగా నుంచుండి తిట్ల పురాణం విప్పేవారు. ఇప్పుడేమో... తల్లి వంటింట్లో, కొడుకు పూజగదిలో.... కొత్తగా ఉందనుకుంది ఇంద్రాణి. మర్యాదగా అడుగులేస్తూ బయటికొచ్చిండు మధుసూదన్. మొహం నిర్మలంగా ఉంది.

"ఎప్పుడొచ్చినవ్ చెల్లెమ్మా? మా బావ, బుజ్జి బాగున్నారా ఇందూ?" ఆప్యాయంగా అడిగిండు.

"అంతా బాగున్నారన్నయ్యా. ఇప్పుడే వచ్చాను. కంగ్రాట్స్.... తండ్రివి కాబోతున్నావటగా!" కావాలనే అంది ఇంద్రాణి.

"ఆ...ఆ... అంతా ఆ తల్లిదయ" కళ్ళతో పూజ గదివైపు చూపిస్తూ చేతులెత్తి దండం బెట్టిండు.

"ఆ తల్లి దయనా? అందులో ఏ తల్లి ఉంది? నువ్వెట్లా మారిపోయిన వన్నయ్యా?" అడుగుదామనుకుంది... కాని ఆ మాటలు గొంతులోనే ఆగిపోయినై.

"చీకటి పడింది. అత్తయ్య ఎదురు చూస్తుందేమో ఇక వెళ్దామా వదినా!" త్రివేణి లేచి నుంచుంది.

రాత్రి భోజనాలయ్యాక తల్లిపక్కలో పసిపాపలా ఒదిగిపోయింది ఇంద్రాణి.

"అమ్మా. నాకంతా అయోమయంగా ఉండే అసలేం. జరుగుతోంది. అక్కడ" శిరీష ఇంటి విషయం అడిగింది.

"అదంతా ఆ తల్లిదయ ఇందూ" అదోలా నవ్వింది సుమతి.

"అసలేం జరిగిందో చెప్పమ్మా"

సుమతి చెప్పడం మొదలెట్టింది.

"రెండేళ్ళ క్రితం ఎప్పట్లాగే ఆ రోజు గూడా అత్త తిట్లు భర్త కొట్లు భరించలేక లబలబ లాడ్తూంది శిరీష. ఓ పెగ్గు ఎక్కువ తాగొచ్చిండేమో పిడిగుద్దులు మోతాదు మించిపోయినై. పాపం. ఎన్ని రకాల వేధింపులు భరిస్తుంది, ఎంత కాలం సహిస్తుంది. కొంగు నోటికడ్డం పెట్టుకుని ఊరవతలికి ఉరుకు తోంది. అది చూసి నేను గబగబా శిరీషను వెంబడించిన. ఊరవతల ఈశ్వరాలయం పక్కనున్న పాడుబడ్డ బావి దగ్గరాగింది. కొంగును నుదుముకు చుట్టుకుంది. చీర కుచ్చిళ్ళను మలిచి గోచీలాగ చెక్కుకుంది. బావి పక్కన నిటారుగా నిల్చుంది.

'గంగమ్మ తల్లీ! కన్నవాళ్ళు నాకు చిన్నప్పుడే కరువైపోయింద్రు. నువ్వే నా తల్లి విప్పుడు. నీ ఒడిల నాకింత జాగా ఇవ్వు తల్లీ' అంటూ చేతులెత్తి దండంబెట్టింది. ఒక్క క్షణం ఆలస్యమైనా బావిలో దూకేదే. నా శక్తినంతా కూడదీసుకుని ఉరికిన. ఆ పిల్ల జబ్బలందుకుని వెనక్కులాగి గట్టిగ పట్టుకున్నా. గిరుక్కున వెనక్కి తిరిగింది. పాపం పొత్తి కడుపుల నుంచి ఏసరు ఎగదన్నుకొచ్చిందేమో. 'నా బతుకు బండలైంది. ఇంకెందుకు బతకాలె పిన్నీ? నీకు దండం బెడ్త... నన్నాపకు పిన్నీ!' అని పెనుగులాడబోయింది. ఏం చెయ్యాల్నో నా కర్థం కాలేదు. గాని.... దబదబ లెంపలు వాయించి గుండెలకు హత్తుకున్నా. 'ఇప్పుడు నువు నా తల్లోలె కనబడుతున్నావు పిన్నీ!" అని వెక్కివెక్కి ఏడ్చింది.

ఓ చెట్టుకిందికి తీస్కపోయిన. అయినా శిరీష గుండెలు ఎగిరిపడుతూనే ఉన్నై అప్పుడు నా కళ్ళల్ల నువ్వే తిరిగినవు. నా కడుపు చెరువైపోయింది. ఇదే నా కూతురైతే ఏం చేసేదాన్ని?.. అని బాగా ఆలోచించిన. ఆ పిల్లకు నచ్చజెప్పి తరుణోపాయం చెప్పిన. ఈ ప్లాను. ఫెయిలైతే ఇంకోటి చెప్తాగాని ఆత్మహత్యకు పాల్పడవద్దని ఒట్టేసి చెప్పిన.

మర్నాడు ఆదివారం శిరీష వాళ్ళ వాకిట్లోకొచ్చి ఊహూ... ఊహుహూ... అంటూ వణకడం ప్రారంభించింది. తుఫాను గాలిలో చెట్టులా ఒళ్ళంతా ఊగుతోంది. నా సైగ అందుకుని కొప్పువిప్పి వెంట్రుకలు విరబోసుకుంది. మధుసూదన్, అతని తల్లి బయటికొచ్చింద్రు. కోపం, రోషం కలెగలిపి పొంగుకొచ్చాయేమో. 'నీ యవ్వ! పిచ్చిముండా!' అంటూ మధుసూదన్ పడికిళ్ళు బిగుసుకుపోతున్నై. ఓ పిడికిలి పైకి లేవబోతోంది.

'అరేయ్... మధుసుదన్! గర్వాంధుడా! నీకు పోయేకాలం దగ్గరి కొచ్చిందిరా...' శిరీష చిందులు షురువైపోయినై. దొంగ దెబ్బతిన్న తోడేళ్ళలాగా తల్లీకొడుకులు వణికిపోయింద్రు. మొహాలు విచిత్రంగా మారినై. పైకి లేవబోయిన పిడికిలి చెయ్యి శిరీష చేతుల్లో నలిగి పోతుంది.

'వామ్మో! గింతబలం దీనికెక్కడిదిరా!' తల్లి హడల్.

'వాయ్యో! నీది చెయ్యా లేక అరకొత్తా?' కొడుకు గింజుకుంటున్నడు. 'నడిబజార్ల నా పరువు గంగల కలుస్తుందే. లోపలికిరా!" గట్టిగా చెయ్యి లాక్కున్నాడు.

"నేనెవరిననుకున్నావురా....?"

"నా పెండ్లాం.. శిరీషవు....!"

"కాదు" దిక్కులు పిక్కటిల్లినై బజారులో నడుస్తున్న జనాలు చుట్టూ చేరుతున్నరు. 'అరేయ్! నేను ఎల్లమ్మను.. రేణుకా దేవినిరా ఛండాలుడా! ఒరేయ్ అల్పుడా! మీ నాయినమ్మ మీదినుంచి నీ పెళ్ళాం మీది కొచ్చిన... కాళ్ళూ చేతులు విచిత్రంగా తిరుగుతున్నై. "మీరు నన్ను మరిచిపోయింద్రు రా...."

'అమ్మో... శిరీషకు సిగమొచ్చిందే!" మధుసూదన్ అరిచిండు. తోడేళ్ళ మొహాలమీద చిరుచెమటలూరుతున్నై మొహాలు చూసుకుని లెంపలేసుకుని దండం బెట్టింద్రు.

'అమ్మా.... తల్లీ... తప్పై పోయిందమ్మా మా అపరాధం మన్నించమ్మా' తల్లి మొకరిల్లింది. 'అరేయ్ మధూ! ఎల్లమ్మరా... మన కులదైవంరా! కాళ్ళు మొక్కురా'... కొడుకును పురమాయించింది. బెల్లం చుట్టూ ఈగల్లాగా జనాలు మూగుతూనే ఉన్నారు.

'అట్లనా... క్షమించమ్మా! తల్లీ... నీకేం కావాలమ్మ' సాష్టాంగ ప్రణామం చేసిండు.

"అఁ.. అట్లా దారికిరారా! కొంచెం బుద్ధి తెచ్చుకోండిరా...'

'మా అపరధమేందమ్మా?"

'నీ ఇంటి ఇల్లాలి ఉసురుబోసుకుంటున్నార్రా... ఇంటికి దీపం ఇల్లాలు. కంట తడిబెట్టే నువ్వూ నీ వంశం సర్వనాశనమైతది. నీ తల్లికి అకాల మరణం దాపురిస్తుంది...."

'అమ్మో... అయ్యో... ఇప్పటికే వానికి పిల్లల్లేరు. గట్లనకమ్మా తల్లీ...' తల్లి గుండెలు బాదుకుని పాదాలందుకుంది. 'తప్పై పోయిందమ్మీ.. తప్పై పోయింది".

'తప్పూ... చిన్న తప్పుగాదే పెద్దమనిషీ!" చిందులకు తోడు శిరీష పళ్ళు పటపటలాడినై..... 'నువ్వేమో... మొగుణ్ణి సాగనంపి మొండిముండవై పోయినవ్.. నువ్వూ ఈ ఇంటి కోడలువేనని మరిచిపోయినవ్. పూటకు తల్లెడు తినుకుంట మంచం

నింద పండుకుంటున్నవ్. నా పూజలు మర్చిపోయినవ్. నీ అత్తజెప్పిన మాటలు గుర్తుకు దెచ్చుకో. మూడ్రోజులల్ల నన్ను నీ ఇంట్ల నిలవెట్టుకోకపోతే నువు గుండాగి ఛస్తవ్. నీ ఇల్లు కాలి పోతది. నీ కొడుకు కుక్కచావు ఛస్తడు. నీ కోడలు ముండవాలై ఏడ్చి ఏడ్చి చచ్చిపోతది...."

ముక్కుమీద వేలేసుకుని వింతగా, వినోదంగా చూస్తున్నరు జనాలు. కొందరు సలహాలిస్తున్నారు.

'అరే పాపం! సర్వనాశనమై పోతరు...'

'మొక్కుండ్రి, మంచిగ మొక్కుండ్రి...'

'ఆ తల్లిని నిలవెట్టుకోండి. ప్రతిష్టజేసి రోజూ పూజ చెయ్యుండ్రి....'

"అమ్మమ్మా... గంత పనొద్దు తల్లీ..." తల్లి లెంపలు వాయించుకుని మళ్ళీ కాళ్ళందుకుంది. "శాంతించమ్మా.. రేపే నీ పూజలు షురూ చేస్తం ఇంట్ల నిన్ను నిలవెట్టుకుంటం..."

'నా పెళ్ళాన్ని పువ్వోలె చూసుకుంటమమ్మా' మధుసూదన్ ఆందోళన అంతా ఇంతా కాదు. 'దయచేసి శాంతించు తల్లీ... తెల్వక చేసిన తప్పులు మన్నించమ్మా అమ్మా! గాపసుపు కుంకుమలందుకోవే'.... తల్లిని పరుగెత్తించిండు. శిరీషకు బొట్టు వెట్టి కాళ్ళు మొక్కి శాంతింపజేసిండు.

ఇంకేముంది! వాళ్ళ పూజాగదిల రేణుకాదేవి విగ్రహం వెలిసింది. నిత్యపూజలు జరుగుతున్నై. తల్లీ కొడుకు లేమన్నా తోక ఝాడిస్తే... శిరీషకు సిగమొస్తుంది. మధుసూదన్ తాగుడు బందైపోయింది, తల్లి నోటికి తాళం పడింది. వాళ్ళ సంసారంలో పచ్చదనం విచ్చుకుంది. ఇందూ!"

అంతా విన్నాక ఇంద్రాణిలో ఆనందం తొణికిసలాడింది.

అది మూఢ నమ్మకమో, గాఢ విశ్వాసమో గాని... కుక్కలు చింపిన విస్తరై పోతుందనుకున్న ఓ అబల జీవితాన్ని నందనవనంగా మార్చింది.

"చాలా మంచి పని చేశావమ్మ. అందుకే నీకు మంచికోడలు దొరికింది. జాగ్రత్త బాగ చూసుకో. లేకుంటే నువ్వు చెప్పిన ప్లానే నేనుకూడా ఆ పిల్లలకు చెప్పి నిన్నో ఆటాడిస్తా" అంది ఇంద్రాణి నవ్వుతూ.

"నోర్ముయ్యవే నేనేమీ నా కోడలికి ఆ గతి పట్టించను. అయినా ఇలాంటి ప్లాన్లతో ఒకటి రెండు కాపురాలు నిలవొచ్చమ్మా. కానీ అందరి కాపురాలు? మనం కాసింత మంచి బుద్ధి పెడితే, మారడానికి సిద్ధంగా ఉంటే అంతా మంచిది. అందరికీ మంచిది. ముందు త్రివేణితో పెళ్లి పద్దన్నాను. ఇప్పుడు త్రివేణిని నెత్తిన పెట్టుకోవడం లేదా? ఇప్పుడు నాకూ ఆ పిల్లకీ ఇంటివాళ్లందరికీ ఎంత హాయిగా ఉందనీ. ఈ హాయి అందరి ఇళ్లల్లో ఉండాలి" అంది.

కూతురు తల్లికి ఇంకాస్త దగ్గరగా జరిగింది. ప్రేమగా. ఇంతలో త్రివేణి వచ్చి వాళ్ల పక్కన కూర్చుంది. ఆ ముగ్గురు అడవాళ్లు నవ్వుకుంటూ తుళ్లుకుంటూ హాయిగా కబుర్లు చెప్పుకుంటుంటే బయట వెన్నెల చల్లగా కాస్తూ ఉంది.

**ఆదివారం ఆంధ్రజ్యోతి 20 ఏప్రిల్, 2003**

★ ★ ★

